నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శనివారం
18 జనవరి
2025
పేజీలు 8

గుంటూరు
పల్నాడు

రాష్ట్రవ్యాప్తంగా కొత్త మద్యం షాపులు ఏర్పాటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. బాపట్ల జిల్లాలో 12, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 13 షాపులు చొప్పున ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు కసరత్తు పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఇందుకు తగ్గట్లు మరో వారం రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త మద్యం పాలసీని తీసుకువచ్చింది. దీంతో మిగతా జిల్లాలతో పోల్చుకుంటే ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ సంక్రాంతి సీజన్ లో భారీ ఎత్తున మద్యం అమ్మకాలు జరిగినట్లు చెబుతున్నారు. సంక్రాంతి వేళ మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. పండుగ మూడు రోజుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు రూ. 18 నుంచి రూ.20 కోట్ల విలువచేసే మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 340 మద్యం షాపులను కల్లు గీత కార్మికులకు కేటాయించాల్సి ఉంది. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ వర్గీయులకు 38 షాపులు కేటాయించబోతున్నారు. రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు సాగటంతో ప్రభుత్వ ఆదాయం కూడా పెరిగింది.....

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో





# కొత్త మద్యం షాపులకు రంగం సిద్ధం !

ఏపీలో మరిన్ని మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు జిల్లాల వారీగా కొత్త మద్యం దుకణాల నోటిఫికేషన్ జారీకి రంగం సిద్ధం అవుతోంది. కొత్త మద్యం పాలసీ అమలు తరువాత ఏపీ లో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. సంక్రాంతి వేళ మద్యం సేల్స్ కొత్త రికార్డు నెలకొల్పాయి. ఏకంగా మూడు రోజుల్లో రూ 400 కోట్ల మేర అమ్మకాలు జరిగాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా వినియోగం జరిగినట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. కల్లుగీత కార్మికులకు రాష్ట్రవ్యాప్తంగా 340 మద్యం షాపులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది

**రికార్డు స్థాయిలో అమ్మకాలు**

ఏపీలో సంక్రాంతి వేళ మద్యం అమ్మకాలు భారీగా జరిగాయి. ప్రభుత్వం కొత్త మద్యం పాలసీలో భాగంగా రూ 99 కే క్వార్టర్ మద్యం అందుబాటులోకి తెచ్చింది. కొత్త సంవత్సరం వేళ భారీగా మద్యం అమ్మకాలు జరిగాయని భావించగా.. ఇప్పుడు సంక్రాంతికి ఆ రికార్డు బ్రేక్ అయింది. తాజాగా సంక్రాంతి 3 రోజుల్లో 400 కోట్ల అమ్మకాలు జరిగాయి. సాధారణం కంటే 160 కోట్లు ఎక్కువగా అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా వినియోగం ద్వారా లిక్కర్ సేల్స్ కొత్త రికార్డు నెలకొల్పాయి. ఇక, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్లు గీత కార్మికుల కు రాష్ట్రంలో 340 మద్యం షాపుల కేటాయింపుకు రంగం సర్కార

**ఎన్నికల హామీ మేరకు**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్లుగీత ఉపకులాల వారీగా వారం రోజుల్లో వీటికి నోటిఫికేషన్ జారీ చేయనుంది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటు మద్యం షాపుల పాలసీలో 3,396 షాపులకు లైసెన్సులు జారీచేశారు. అందులో 10శాతం ఇప్పుడు గీత కులాలకు ఇవ్వనున్నారు. అలా వచ్చే 340 షాపుల్లో నాలుగు షాపులు సొండి కులానికి విడిగా కేటాయిస్తారు. గతంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన కుటుంబానికి ఒక షాపును కేటాయించనున్నారు. మిగిలిన 335 షాపులకు నోటిఫికేషన్ జారీచేస్తారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. దరఖాస్తు రుసుము రూ.2లక్షలుగా ఉంది. అయితే లైసెన్స్ ఫీజులు సగం చెల్లిస్తే సరిపోతుంది. 2016లో చేసిన స్మార్ట్ పల్స్ సర్వేని కులాల జనాభాకు ప్రామాణికంగా ఈ దుకాణాల ఏర్పాటుకు నిర్ణయించారు.

**ఏ జిల్లాలో ఎన్ని షాపులంటే..**

తిరుపతి జిల్లాలో అత్యధికంగా 23 షాపులు గీత కులాలకు కేటాయించారు. అల్లూరి జిల్లాలో ఒక్క టీ లేదు. అనంతపురంలో 14, శ్రీసత్యసాయిలో 9, అన్నమయ్యలో 11, చిత్తూరులో 10, తూర్పు గోదావరిలో 13, కాకినాడలో 16, కోనసీమలో 13, బాపట్లలో 12, గుంటూరులో 13, పల్నాడులో 13, కడపలో 14, **మిగతా 3వ పేజీలో**

- **ఉమ్మడి గుంటూరు జిల్లాకు 38 షాపులు కేటాయింపు**
- **అన్ని షాపులు కల్లుగీత కార్మికులకే**
- **సంక్రాంతి సీజన్‌లో జోరుగా సాగిన మద్యం అమ్మకాలు**
- **క్వార్టర్ బాటిల్ రూ.99 అమ్మక ప్రభావం ఎక్కువే**



# అర్హులకు చోటు..! అనర్హులపై వేటు..!!

- **అనర్హుల పెన్షన్లు కట్..!!**
- **కూటమి సర్కార్ నిర్ణయం**
- **వికలాంగు పెన్షన్లపై నే దృష్టి**
- **జిల్లావ్యాప్తంగా పరిశీలన**

సామాజిక పెన్షన్లను పెద్ద మొత్తంలో పెంచి ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం లబ్దిదారులకు అందిస్తోంది. నిజానికి దేశంలో ఎక్కడా లేని విధంగా నాలుగు వేల రూపాయలను పెన్షన్ గా అందించే ఏకైక స్టేట్ గా ఏపీ నిలిచింది. దీని కోసం వేలాది కోట్ల రూపాయలు ఖజానా నుంచి ఖర్చు అవుతున్నాయి. అయితే అర్హులు ఎంతమంది ఉన్నా పెన్షన్లు ఎంత మొత్తం అయినా ఇచ్చే విషయంలో తప్పు లేదు. కానీ అనర్హులు పెన్షనర్లుగా ఉంటే మాత్రం అది ప్రజా ధనం వృధా కింద లెక్క. అంతే కాదు చాలా మంది అర్హులకు అన్యాయం జరిగినట్లుగా కూడా చూడాలి. ఈ నేపథ్యంలో అనర్హులను భోగస్ లబ్దిదారులను ఏరివేసేందుకు కూటమి సర్కార్ ఆ మధ్య కాలంలో పెద్ద ఎత్తున ప్రత్యేక సర్వేను నిర్వహించింది. ఇది రాండం చెకప్ గా సాగిన సర్వేగా ఉంది. అయితే ఈ సర్వేలోనే భారీగా అనర్హులు ఉన్నట్లుగా తేలింది. అందులో ఎక్కువ శాతం కేసులు వికలాంగుల కోటాలోనే అని కూడా సర్వే నివేదికలో తేలింది అని అంటున్నారు. దాంతో ప్రభుత్వం ఇపుడు పూర్తి స్థాయి సర్వేను నిర్వహించాలని డిసైడ్ అయింది అని అంటున్నారు. ఇక ఈ సర్వే నివేదికను చూస్తే కనుక తక్కువ మోతాదులో వికలాంగత్వం ఉన్నా కూడా ఎక్కువగా ఉన్నట్లుగా రాయించుకుని పెన్షన్లు పొందుతున్నారని అంటున్నారు. ఇక ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్లు నాలుగు వేలుగా ఇస్తోంది. అదే సమయంలో వికలాంగులకు ఆరు వేలు నెలకు చెల్లిస్తోంది. దీర్ఘ కాల వ్యాధిగ్రస్తులకు అయి మంచాన పట్టిన వారికి నెలకు పదిహేను వేల రూపాయలు ఇస్తున్నారు. అంతే కాదు పక్షవాతంతో బాధపడేవారికి పదివేల రూపాయలు పెన్షన్ ఇస్తున్నారు. దాంతో ఈ పెన్షన్లలో బాగా భోగస్ లెక్కలు ఉన్నాయని **మిగతా 3వ పేజీలో**

**అనర్హుల పెన్షన్లు తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బెత్తం పట్టింది. ముఖ్యంగా వికలాంగుల పెన్షన్లు పొందిన వారిలో అనర్హులు ఎక్కువగా ఉన్నారని ప్రభుత్వం ఇప్పటికే అనేకసార్లు చెబుతూ వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్న అనేకమందిని పక్కన పెట్టి అర్హత లేని వారికి పెన్షన్లు ఇచ్చారని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అర్హత ఉంటే ఎంతమందికైనా పెన్షన్లు ఇవ్వవచ్చు... అనర్హులకు ఇవ్వటం ప్రజాధనాన్ని వృధా చేయటమేనని సర్కార్ భావిస్తోంది. పూర్తిగా పరిశీలించి మరో రెండు నెలల్లో అనర్హత పెన్షన్ దారులను గుర్తించి వారి పేర్లు తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది....**

**- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**


## రాష్ట్రంలో పేదరికం నిర్మూలన చంద్రబాబుతోనే సాధ్యం : కందుల వేణు వర్ధన్



**గుంటూరు, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదరికం నిర్మూలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు, అఖిల భారత గౌడ సంఘం గుంటూరు జిల్లా యువత అధ్యక్షుడు, తెనాలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నేత, పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ నేత కందుల వేణు వర్ధన్ స్పష్టం చేశారు శుక్రవారం తెనాలి మారిస్ పేట ఆయన నివాసం వద్ద కందుల వేణు వర్ధన్ మాట్లాడుతూ గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించిన ప్రజెంటేషన్ పేదరికం లేని రాష్ట్రమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎన్నికలకు ముందుకు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృఢ సంకల్పంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు అమరావతి పూర్తయితే భారతదేశంలోనే నెంబర్ రాజధాని అవుతుందన్నారు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ళ అరాచక పాలన వల్ల రాష్ట్రానికి అప్పులు ఆర్థిక భారం పెరిగిందని అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి పెద్ద పీట కూటమి ప్రభుత్వం వేస్తుంది అని కందుల వేణు వర్ధన్ తెలిపారు.

## సినిమా హాల్ తూనికలు కొలతల శాఖ అధికారుల తనిఖీ





**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఈశ్వరసాయి డీలక్స్ థియేటర్లో సినిమా చూడడానికి వచ్చే ప్రేక్షకులకు, విరామ సమయంలో అమ్మే వాటర్ బాటిల్ రూ 20 లు ను రూ.30 లకు శీతల పానీయాల లైన థమ్సప్,300 ఎం ఎల్ టిన్ రూ 40 లుగా ఉండగా దానిని 60/- చేసి అమ్ముతున్నట్లుగా వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తూనికలు కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. సినిమా హాళ్ళలో అమ్మే పాప్ కార్న్... ఫ్రెంచ్ ఫ్రైస్.. సమోసా... కేక్స్ వంటి వాటి వాటి కొలతలు వాటి రేట్లు ప్రేక్షకులకు కనిపించే విధంగా డిస్ప్లేలో లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతి థియేటర్ తప్పనిసరిగా ఒక కాటాను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రేక్షకుల నుండి ఫిర్యాదులు ఏమైనా వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారులకు ఎమ్మార్పీ రేట్ల కంటే అధిక రేట్లకు అమ్మడానికి వీల్లేదని, అట్లా అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల శాఖ అధికారి ఎస్ కే జాన్ సైదా అన్నారు.

## శ్రీనివాసరావు మాతృమూర్తిని పరామర్శించిన అంబటి



**పెదకాకాని, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కొప్పురావూరు గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోట శ్రీనివాసరావు మాతృమూర్తి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పొన్నూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శుక్రవారం పరామర్శించారు. కార్యక్రమంలో గుంటూరు నగర పార్టీ అధ్యక్షులు డిప్యూటీ మేయర్, తాటికొండ నియోజకవర్గం సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు), నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మతోన్మాద శక్తుల పట్లు అప్రమత్తంగా ఉండాలి : సీపీఎం



**గుంటూరు మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో మతోన్మాద శక్తులు పాగా వేసే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయని అలాంటి శక్తుల ఎడల అప్రమత్తంగా వుండి ప్రతిఘటించాలని సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి. హెచ్. బాబురావు పిలుపునిచ్చారు. బ్రాడిపేటలోని సిపియం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామారావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సి. హెచ్. బాబురావు మాట్లాడుతూ కేంద్రంలో బి.జె.పి అధికారంలోకి వచ్చాక నిత్యజీవితావసర సరుకులు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశన్నంటుతున్నాయని, మరోవైపు సాధారణ ప్రజలకు ఉపాధి తగిన విధంగా లేదని, పేదలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జమిలీ ఎన్నికల పేరుతో భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తూ, రాష్ట్రాల హక్కులను కాలరాసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పేదలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని వాగ్దానం చేసి, సర్దుబాటు ఛార్జీల పేరుతో 16వేలకోట్ల రూపాయాలు విద్యుత్ భారాలు మోపడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, ఉచిత ఇసుక విధానాన్ని అమలు పరచాలని కోరారు. సిపియం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ జిల్లా వ్యాపితంగా ప్రభుత్వ భూముల్లో ఇళ్ళు వేసుకుని నివాసము ంటున్న పేదలకు ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని, అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలిచ్చి ఇళ్ళు నిర్మాణానికి కనీసం 5లక్షలు కేటాయించాలని కోరారు. రేతాంగం అనేక వ్యయ ప్రయాసలకోర్చి పంటలు పండిస్తే గిట్టుబాటు ధర రావడం లేదని, మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, జిల్లాలో ఖాళీగా వున్న అంగన్ వాడీ పోస్టులను భర్తీ చేసి అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. స్కీమ్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికలకు ముందు స్కీమ్ వర్కర్స్‌కు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎన్.భావన్నారయణ, కె.నళినీకాంత్, ఎమ్.రవి, బూరగ వెంకటేశ్వర్లు, ఎల్.అరుణ, యస్.యస్.చెంగయ్య, జవహర్‌లాల్, పి.కృష్ణ, ఎమ్.ఎ.చిష్టీ తదితరలు పాల్గొన్నారు.

### పంట కాలవల్లో నీటిపారుదలను

# అడ్డంకులు ఉండకూడదు

**పంట కాలువలను పరిశీలించిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు**



**గుంటూరు మేజర్ న్యూస్ :** గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలంలోని పంట కాలవల పూడికతీత అనంతరం నీటిపారుదలను ప్రతి కాలవ దగ్గరకు వెళ్లి నీటిపారుదలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాలువలు పూటకి తీతలేక నీటిపారుదల లేక రైతులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని నీటి సంఘాల ఎలక్షన్ లో జరిగిన 15 రోజులో వచ్చిన మొదటి రోజు నుండే రైతులు సమస్యల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ముఖ్యమైన పంట కాలమును కూడక తీసి చివర రైతు పొలం వరకు నీళ్లు అందే విధంగా పనులు జరుగుతున్నాయని, రైతులందరూ నీళ్లు అందటంతో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారని , అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందని త్వరలోనే ఈ కార్యక్రమం పూర్తి చేస్తామని వారన్నారు. వారితోపాటు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జనసేనాని పోరాటం ఫలించింది

**జనసేన పార్టీ నాయకులు తిరుమల శెట్టి కొండలరావు**



**మంగళగిరి టౌన్, మేజర్ న్యూస్:** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు ఓటమి ప్రభుత్వం అడ్డుగోడగా నిలిచిందని జన సేన పార్టీ నాయకులు తిరుమల శెట్టి కొండలరావు అన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటుపరం కాకుండా స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి సర్వశక్తులొడ్డిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కృషి అనితర సాధ్యం అని అన్నారు. ప్రధాని మోదీ, ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామి, అశ్విన్ వైష్ణవి, నిర్మలా సీతారామన్ లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. విశాఖ ఉక్కు ఉద్యమ సారథి అమృతరావు స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో అసువులు బాసిన 32 మంది అమరవీరుల త్యాగం ఫలించిందని వారంతా చిరస్మరణీయులని ఆయన కొనియాడారు.

# పంట కాలంలో పండించిన పంటను నమోదు చేయాలి

**జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు**



**పెదకాకాని, మేజర్ న్యూస్ :** కౌలు రైతు కార్డుల ద్వారా పంట కాలంలో పండించిన పంటను నమోదు చేసుకుంటే విపత్తులు సంభవించి నప్పుడు ఇన్పుట్ సబ్సిడీ ఆ కౌలు రైతులకు అందించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోళ్ళమూడి, నంబూరు గ్రామాలలో పొలం పిలుస్తుంది లో భాగంగా పంట సాగుదారు హక్కు పత్రం కవుల రైతులకు వ్యవసాయ పంట రుణాల మంజూరు పై గ్రామస్థాయిలో అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తిన పంటకు ఇన్సూరెన్స్ చేయడం ద్వారా కూడా పంట రక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మద్దతు ధర లేనప్పుడు కొనుగోలు కేంద్రాల ద్వారా పంట నమోదు అయిన రైతులు నుండి పండెన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతు కార్డులు 11 నెలల కాలంలో ఇవ్వబడుతుందని, కేవలం పంటకాలం వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని, భూమికి సంబంధించినది కాదని తెలియజేశారు. నంబూరు ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ ఎన్.నాగబాబు మాట్లాడుతూ రైతులు తీసుకునే సర్వే నెంబర్లు గల భూములలో కవులు రైతులకు రుణాలు ఇవ్వడం జరుగుతుందని, రుణాలు ఇచ్చిన తరువాత లోన్ బోర్డులో నమోదు చేయబడతాయని, రుణాలను సకాలంలో రైతులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచారకులు టి. శ్రీనివాసరావు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారిణి పి. సంధ్యారాణి, నీటి సంఘం అధ్యక్షులు మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ద్విచక వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

### గుంటూరు ఉప రవాణా కమిషనర్ కె.సీతారామి రెడ్డి

**గుంటూరు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్, ఆంధ్రప్రదేశ్, విజయవాడ వారి ఆదేశాల మేరకు రోడ్డు భద్రతా మాసంలో భాగంగా గుంటూరు ఉప రవాణా కమిషనర్ కార్యాలయ ఆవరణలో ద్విచక వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించామని గుంటూరు ఉప రవాణా కమిషనర్ కె.సీతారామి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 100 మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్ యొక్క ప్రాముఖ్యత గురించి ద్విచక్ర వాహనదారులలో అవగాహన, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు. మోటారు వాహనంతో ప్రమాదానికి గురైన బాధితుడి జీవితాన్ని రక్షించిన గుడ్ సమరిటను అవార్డుల మంజూరు కోసం పథకం గురించి అవగాహన కల్పించబడింది. ఈ



కార్యక్రమములో బి సత్యనారాయణ ప్రసాద్, ప్రాంతీయ రవాణా శాఖ అధికారి, గుంటూరు, ఎంవీఐ లు గోపాల్, మల్లీశ్వరి. జి సౌజన్య, ఎఎంవిఐ సంధ్య పై కార్యక్రమాన్ని నిర్వహించగ ఎన్జీవోలు, సి హెచ్ హరిబాబు, సిహెచ్ ప్రసాద్, కవిత. బేబీ సరోజిని పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పీపుల్ టెక్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు భేటీ

**గుంటూరు, మేజర్ న్యూస్ :** కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఎలక్ట్రిక్ వెహికిల్ పార్క్ ఏర్పాటు 'పర్యావరణహితమైన వాహనాల వినియోగం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడంపై గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలు విరివిగా అందుబాటులోకి రావాలి' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పీపుల్ టెక్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రివర్యులతో భేటీ అయ్యారు. ఈ సంస్థ ఓర్వకల్లు దగ్గర 12వందల ఎకరాల్లో ఎలక్ట్రిక్ వెహికిల్ పార్కు నెలకొల్పేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంతో ఎం.ఓ.యూ. చేసుకొంది. ఇందుకు సంబంధించిన వివరాలను పీపుల్ టెక్ గ్రూప్ సి.ఈ.ఓ. టి.జి.విశ్వప్రసాద్ తెలియచేశారు. 'వాహన తయారీ, ఆర్. అండ్ డి. కేంద్రాలు, టెస్టింగ్ ట్రాక్స్, ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్



ప్రాంతాలాంటివి ఇందులో ఉంటాయి. దేశంలో ఇదే తొలి ప్రైవేట్ ఈ.వి. పార్కు. దీని ద్వారా రూ.13 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయనీ, 25 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయ'ని వివరించారు. పవన్ కళ్యాణ్ స్పందిస్తూ 'కర్నూలు జిల్లా ఓర్వకల్లు దగ్గర ఎలక్ట్రిక్ వెహికిల్ పార్క్ ఏర్పాటు కానుండటం ఆహ్వానించదగ్గ పరిణామం. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇదొక మైలు రాయి. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకి అనువైన విధానాలు తీసుక ొచ్చింది' అన్నారు. ఉప ముఖ్యమంత్రి వర్యులతో సమావేశమైన వారిలో భాస్కర రెడ్డి, రవికిరణ్ ఆకెళ్ళ, బాబ్ డఫ్ఫీ, స్టీవ్ గెర్బర్, హెరాల్డ్ రక్రిజెల్ ఉన్నారు.

## నేడు వివిధ కేసులకు సంబంధించిన వస్తువులకు కోర్టు ఆవరణలో వేలం

**గుంటూరు మేజర్ న్యూస్ :** గుంటూరు మూడవ అదనపు సివిల్ జడ్జ్ ( జూనియర్ డివిజన్) కోర్టులో కోర్టు వారి ఆదేశాల మేరకు పెదకాకాని, అరండల్ పేట పోలీస్ స్టేషన్లలో వివిధ కేసులకు సంబంధించిన వస్తువులను బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కోర్టు వారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 తారీకు శనివారం ఉదయం 11:30 గంటలకు కోర్టు ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పెదకాకాని పోలీస్ స్టేషన్ లో వున్న వైట్ కలర్ నోకియా ఫోన్ , బ్లాక్ కలర్ నోకియా సెల్ ఫోన్., అరండల్ పేట పోలీస్ స్టేషన్ ( లా అండ్ ఆర్డర్) కు సంబంధించి 1. ఎల్ జి కంపెనీ మానిటర్ (కేబుల్‌తో), సిపియు జిప్ , లాగిటెక్ కీబోర్డ్, మౌస్, కార్డు రేడర్ (ఆరోమా), అరండల్ పేట పోలీస్ స్టేషన్ కు సంబంధించిన, సిపియు (బుటల్ చెర్రీ కంపెనీ ), హెచ్ పి మానిటర్ లు ఆక్షన్ లో ఉంచబడతాయని వారు వెల్లడించారు.

## పవన్ కళ్యాణ్ పోరాటంతో విశాఖ ఉక్కుకు మహర్ధశ

గుంటూరు, మేజర్ న్యూస్ : పవన్ కళ్యాణ్ ఐదేళ్ల పోరాటం ఫలించిందని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటుపరం కాకుండా స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి సర్వశక్తులొడ్డిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కృషి అనితర సాధ్యం అని అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గుంటూరు అమరావతిరోడ్డులోని విశాఖ ఉక్కు ఉద్యమ సారధి స్వర్గీయ అమృతరావు



విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ప్రధాని మోదీ, ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామి, అశ్విన్ వైష్ణవి, నిర్మలా సీతారామన్ లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.విశాఖ ఉక్కు ఉద్యమ సారథి అమృతరావు స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో అసువులు బాసిన 32 మంది అమరవీరుల త్యాగం ఫలించిందని వారంతా చిరస్మరణీయులని ఆయన కొనియాడారు. జగన్ కబంధ హస్తాల్లోంచి స్టీల్ ప్లాంట్ ను కాపాడిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్టీల్ ప్లాంట్ ఉద్యమ సారథి స్వర్గీయ అమృతరావు మనవడు మోహన్ గాంధీ గారిని సన్మానించిన రెల్లి రాష్ట్ర నాయకులు సోమి ఉదయ్ కుమార్ , జనసేన నగర కార్యదర్శిలు మెహబూబ్ బాషా , బొడ్డుపల్లి రాధాకృష్ణ , బందెల నవీన్ , డివిజన్ అధ్యక్షులు పవన్ వెంకీ , వడ్డె సుబ్బారావు , మాదుగుల నరసింహ, షేక్ కరీముల్లా, ఆకుల ప్రసాద్ , దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు టిడిపి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 29 వర్ధంతి వేడుకలు

**మాచవరం మేజర్ న్యూస్ :** టిడిపి మండల శాఖ ఆధ్వర్యంలో, టిడిపి గ్రామ కమిటీ శాఖల ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ బడిగుంచల వెంకటేశ్వర్లు, టిడిపి మాజీ మండల కన్వీనర్ ఎడ్లపల్లి రామారావు, పిల్లోట్ల సర్పంచ్ ఎల్ శివపార్వతి సాంబశివరావు, కొత్తపాలెం సర్పంచ్, క్లస్టర్ ఇంచార్జ్ మాచవరం మండలం యామిని రామారావు, కొల గాని శివ ఆయా గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. టిడిపి నాయకులు, టిడిపి ప్రజాప్రతినిధులు, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు టిడిపి కార్యకర్తలు సమనయంతో కార్యక్రమాలు నిర్వహించినట్లు టిడిపి శ్రేణులు పిలుపునిచ్చారు.

## కొత్త మద్యం షాపులకు రంగం సిద్ధం !

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణాలో 12, ఎన్టీఆర్‌లో 11, కర్నూలులో 10, నంద్యాలలో 11, నెల్లూరులో 18, ప్రకాశంలో 18, పార్వతీపురం మన్యంలో 4, శ్రీకాకుళంలో 18, అనకాపల్లిలో 15, విశాఖ 14, విజయనగరంలో 16, ఏలూరులో 14, పశ్చిమగోదావరిలో 18 షాపులు గీత కులాలకు కేటాయించ నున్నారు. ఇందు కోసం గీత కులాలను మూడు కేటగిరీలు చేశారు. ఎ–కేటగిరీలో యాత, బి–కేటగిరీలో గౌడ, ఈడిగ, గౌడ(గమళ్ల), కలాలీ, గౌండ్ల, శ్రీసాయన, సొండి, శెట్టిబలిజ కులాలు ఉన్నాయి. ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

## అర్హులకు చోటు .! అనర్హులపై వేటు..!!

(మొదటి పేజీ తరువాయి)

అంటున్నారు. ఈ నేపథ్యంలో అసలు లెక్కను తేల్చే పనిలో ప్రభుత్వం పడింది. దీని కోసం ప్రత్యేక సర్వేతో ప్రత్యేక వైద్య బృందాలను కూడా రంగంలోకి దించుతున్నారు. అంతే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఈసారి చాలా పకడ్బందీగా సర్వే జరుగుతుందని అంటున్నారు. ఆరు దశలుగా ఈ వికలాంగుల పెన్షన్ లబ్దిదారులకు వైద్య పరీక్షలు జరిపి అందులో అనర్హులు ఉంటే తొలగించాలని ప్రభుత్వం గట్టిగానే ఉంది. ఇక్కడ మరో విషయం కూడా ఉంది. చాలా మంది ఏపీలో ఉండకుండానే పెన్షన్ తీసుకుంటున్నారు. వారు ఇతర రాష్ట్రాలలో ఉన్నారు. అంతే కాదు ఇతర దేశాలలో కూడా ఉన్నారు. దాంతో వారిని గుర్తించి పెన్షన్ కట్ చేయాలని కూడా చూస్తున్నారు. మొత్తానికి కొత్తగా పెన్షన్ కోసం అర్హులు చాలా మంది ఉన్నారు. ముందు అనర్హులను బయటకు తీస్తే అర్హులకు అవకాశం ఉంటుందని అంటున్నారు. పెద్ద ఎత్తున ఫిర్యాదులు కూడా ఈ విషయంలో రావడంతో సీరియస్ గానే ఈ ప్రక్రియ సాగుతుందని అంటున్నారు.

## హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

### ఒక్కొక్కరికి లక్ష రూపాయలు జరిమానా

### తీర్పు వెలువరించిన 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి

**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ :** ఆరండల్ పోలీసు స్టేషన్ పరిధిలో 2014 వ సంవత్సరం లో జరిగిన మర్డర్ కేసు లో ముగ్గురు ముద్దాయిలకి జీవిత ఖైదు, ఒక్కొక్కరికి లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ గుంటూరు 5 వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే గుంటూరు టౌన్, బ్రాడీపేట 3/1 లోని గండికోట అపార్ట్మెంట్ లో నివసించే అడ్వకేటు అయిన రాచాబత్తుని సీత మహాలక్ష్మి గండికోట సుబ్బారావు అనే అతని వద్ద నుండి బ్రాడీపేట 3/1 లోని గండికోట అపార్ట్మెంట్ లో ఒక ప్లాట్ కొనుగోలు చేశారు.ఆ ప్లాటు కొనుగోలు కి సంబందించి డబ్బులు చెల్లింపు విషయమై వారిద్దరి మద్య కొన్ని రోజులుగా గొడవ జరిగింది. ఆ విషయమై ముద్దాయిలు సదరు రాచాబత్తుని సీత మహాలక్ష్మి పై పగ పెంచుకొని, ది. 17.07.2014 న రాత్రి 8 గంటల సమయములో సదరు గండికోట సుబ్బారావు, అతని భార్య గండికోట శ్రీ వాణి, కట్టా మేరీ జ్యోతి అను వారు ముగ్గురూ కలిసి సీత మహాలక్ష్మి పై కత్తితో దాడి చేసి పొడిచి దారుణంగా హత్య చేశారు. మృతురాలి కుమారుడు రాచబత్తుని పవన్ కార్తీక్ ఇచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి అప్పటి ఆరండల్ పేట ఇన్స్పెక్టర్ వై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి న్యాయస్థానానికి చార్జి షీటు దాఖలు చేశారు. ఏపీపి పల్లపు కృష్ణ, కోర్టు హెడ్ కానిస్టేబుల్ 1467, కె శివ నాగేశ్వర రావు, కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు సమన్వయంతో ముద్దాయిలకు జీవిత ఖైదు తో పాటు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు జరిమానా శిక్ష పడేలా కృషి చేశారు.

## పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు

**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరిని కూటమి ప్రభుత్వం గుర్తుపెట్టుకుని సముచిత స్థానం కల్పిస్తుందని పల్నాడు జిల్లా పెద్దకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అమరావతి మండల ముఖ్య నాయకులతో విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండలంలోని సమస్యలను తను దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించి ప్రజలకు దగ్గర అయ్యే విధంగా నాయకులు ముందుకు వెళ్లాలన్నారు.



# 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ సభ



గుంటూరు, మేజర్ న్యూస్ :

జనచైతన్య వేదిక, వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ శనివారం ఉదయం 10:30 గంటలకు నంబూరు సమీపంలో గల వి.వి.ఐ.టి ఆడిటోరి యంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పూర్వ జాతీయ అధ్యక్షులు డా౹౹ జి. సమరం ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 2011 జనవరి 25 నుండి భారత ఎన్నికల సంఘం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రపంచంలో 112 దేశాలలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉండగా దాదాపు 70 దేశాలు నియంతృత్వ దేశాలుగా కొనసాగుతున్నాయన్నారు. 100 కోట్లకు పైగా ఓటర్లతో భారతదేశం అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా ఉంటుందని 61 వ రాజ్యాంగ సవరణ ద్వారా 1989లో ఓటింగ్ వయసును 21 నుండి 18కి తగ్గించడం జరిగిందన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కొత్త ఓటర్ల నమోదు, ఓటు హక్కు పై అవగాహన కల్పించడం, ఓటు వేయడం ప్రాథమిక హక్కుగా, బాధ్యతగా ప్రతి ఓటరు భావించే విధంగా చైతన్య పరచటం లాంటి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తుందన్నారు. భారతదేశంలో 1950లో కులం, వర్గం, మతం, లింగ భేదాలు లేకుండా 21 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించారని, సౌదీ అరేబియాలో 2011లో స్త్రీకి ఓటు హక్కు కల్పించగా ప్రపంచంలో మొదటిసారిగా మహిళలకు ఓటు హక్కు 1893లో న్యూజిలాండ్ లో కల్పించారన్నారు. 1951లో 41 శాతం మంది ఓటింగ్ లో పాల్గొనగా, 2024లో 66శాతం కు పెరిగిందని, ఓటర్ల జాబిత సక్రమంగా రూపొందించడం, రాజకీయ పార్టీల మధ్య పోటీ పెరగటం, ప్రజలలో ఓటింగ్ పట్ల అవగాహన పెరగటం ద్వారా ఓటింగ్ శాతం పెరుగుతూ వస్తుందన్నారు. ఎన్నిక లో డబ్బు, మతం, కులం, మద్యం ప్రభావాలను తగ్గించడం ద్వారా భారతదేశంలో ప్రజాస్వామ్యం వికసిస్తుందన్నారు.

# సయ్యద్ షరీఫ్‌కు శ్రద్ధాంజలి



తెనాలి, మేజర్ న్యూస్

మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా పనిచేయుచున్న సయ్యద్ షరీఫ్ మృతి భాధాకరమని మున్సిపల్ చైర్మెన్ రాధిక, కమీషనర్ బి. శేషన్న లు పేర్కొన్నారు. గతకొద్ది రోజుల క్రితం మరణించిన షరీఫ్ శ్రద్ధాంజలి కార్యక్రమం శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన సేవలను కమిషనర్ కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. షరీఫ్ గుండెపోటుతో బుధవారం మృతిచెందారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మీపతి, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, మునిసిపల్ మేనేజర్ చండి దేవసేన, శానిటరీ ఇన్ స్పెక్టర్లు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ ఆధ్వర్యంలో నేడు మెగా రక్తదాన శిబిరం

తెనాలి, మేజర్ న్యూస్

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరంలో ఎన్టీఆర్ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు. రక్తదానం చేయదలచిన వారు తమ పేరు వివరాలను పార్టీ కార్యాలయంలో నమోదు చేసుకోవలసినదిగా వారు కోరారు.

# న్యాయ పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధంగా ఉండాలి

## ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపు



గుంటూరు మేజర్ న్యూస్:

రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలపై జరుగుతున్న న్యాయ పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధంగా ఉండాలని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి న్యాయవాద లోకానికి పిలుపునిచ్చారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలతో వేధిస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ న్యాయం పక్షాన నిలబడాలన్నారు.పల్నాడు జిల్లా వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షురాలుగా నియమితులైన ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ రోళ్ళ మాదవి శుక్రవారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుంటూరులోని ఆయన నివాసానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన న్యాయవాదులతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ఆమెను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో లీగల్ సెల్ ప్రధాన భూమిక పోషిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను వైయస్ జగన్ ఆవిష్కరించిన తర్వాత మొట్టమొదటిగా ఎగరేసిన ఘనత గుంటూరు న్యాయవాదులకే దక్కుతుందని కొనియాడారు. నాటి నుంచి తనతో పాటు లీగల్ సెల్ నేతలంతా ఎత్తిన జెండా దించకుండా పార్టీ జెండాను భుజాన మోస్తూనే ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలోనే వైసీపీ లీగల్ సెల్ ఆవిర్భావం నుంచి చేపట్టిన ప్రతి కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషిస్తున్న రోళ్ళ మాధవి పల్నాడు జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైనట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, వైసీపీ లీగల్ సెల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, సోమసాని జాన్సీలక్ష్మి, కళ్ళం రమణారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, కోటి, శ్రీనివాసరెడ్డి, మొండితోక శ్రీనివాసరావు, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, కెవిఎస్టి సింగ్, గౌతమి, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పడాల సుబ్బారెడ్డి, దూపాటి వంశీ, పార్టీ నేత గోళ్ళ శివశంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ 19న జిల్లా వ్యాప్త నిరసనలకు

# వామపక్ష పార్టీలు పిలుపు

గుంటూరు మేజర్ న్యూస్:

భారత రాజ్యాంగ నిర్మాత డా?బి.ఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ జనవరి 19వ తేదీన జిల్లాలోని అన్ని ప్రాంతాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్షపార్టీలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అభిమానించే వారిని ఎగతాళిచేస్తూ అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందని, ఆ జపం ఏదో దేవుడిని తలుచుకుంటే స్వర్గమన్నా వచ్చేదంటూ అత్యంత అభ్యంతరకరమైన అమిత్‌షా వ్యాఖ్యలపై దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా, కేంద్రం బి.జె.పి వైఖరిలో మార్పులేదు. ఈ నేపధ్యంలో అమిత్‌షా 19వ తేదీన విజయవాడ పర్యటనకు రానున్నారు. ఈ పర్యటనను వ్యతిరే కిస్తూ జిల్లాలోని పట్టణ, మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని గుంటూరు జిల్లాలోని వామపక్ష పార్టీలు పిలుపు నిస్తున్నాయి. ఈ ప్రకటన చేసిన వారిలో సిపియం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సిపిఐ(ఎమ్.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి విష్ణు, సిపిఐ (ఎమ్.ఎల్) జిల్లా నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, సిపిఐ(ఎమ్. ఎల్) ప్రజాపోరు నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు, సిపిఐ (ఎమ్.ఎల్) లిబరేషన్ నాయకులు రాందేవ్ తదితరులు ఉన్నారు.

## మాచవరంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



మాచవరం , మేజర్ న్యూస్

మాచవరం మండలం లోని మాచవరం 1,2 రైతు సేవ కేంద్రం గ్రామాలలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వ ర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కె. రమమ్మా , సహాయ వ్యవసాయ అధికారిణి,మాచవరం వారు మాట్లాడుతూ కంది, మిరప పంటలను పరిశీలించి రైతులకు వివిధ యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన వివిధ ప్రశ్నలకు నివృత్తి చేశారు. అదేవిధంగా మిరప పంటలో నీలిరంగు, పసుపు రంగు జిగురు అట్టలను మిరప తోటల్లో అమర్చుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు ఎం. కరుణ కుమారి, రైతులు పాల్గొన్నారు.

# రైతులకు వ్యవసాయ పంట రుణాలపై అవగాహన కార్యక్రమం



దుగ్గిరాల, మేజర్‌న్యూస్

దుగ్గిరాల మండలం లోని ఈమని గ్రామంలో రైతులకు వ్యవసాయ పంట రుణాలపై. శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ ఈమని మరియు వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ కౌ లు రైతు కార్డు కలిగి ఉన్నటువంటి రైతులకు వ్యవసాయ రుణాలు అందిస్తామని తెలిపారు. లక్ష రూపాయల వరకు వడ్డీ లేని రుణం ,మూడు లక్షల రూపాయల వరకు పావలా వడ్డీ కల్పిస్తుందని తెలిపారు .ఇప్పటివరకు లోన్. తీసుకొనటువంటి భూ సర్వే నంబర్లను గుర్తించి ఆ సర్వే నెంబర్ లపై. కౌ లు రైతులందరు లోన్ తీసుకునే అవకాశం ఉందని తెలిపారు..ఈ మని బ్యాంక్ మేనేజర్ ఏసుబాబు మాట్లాడుతూ ఈమని గ్రామంలో 52 మిత్ర గ్రూపుల వరకు ఎన్ పి ఏ ఐ ఉన్నవని వాటిని వన్ టైప్ సెటిల్మెంట్ కింద కేవలం 10 నుంచి 15% నగదు కడితే క్లియర్ అవుతాయని, ప్రతి ఒక్క రైతు లోన్ తీసుకొని సకాలంలో చెల్లించాలని కోరారు. రైతు సంఘం అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు ,కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కౌ లు రైతులందరికీ పంట రుణాలు ఇప్పించాలని ఎల్డీఎంకి విజ్ఞప్తి చేశారు. అలాగే లోన్ తీసుకున్న ప్రతి ఒక్క రైతు సకాలంలో చెల్లించడాన్ని బాధ్యతగా గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ ఉషారాణి ,మండల వ్యవసాయ అధికారి పి. శిరీష ఏ ఈ ఓ రమేష్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, వీఆర్వో వీఏఏలు రఫీ, ప్రియాంక , రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధిలో సీనియర్ సిటిజన్స్ సూచనలు ఎంతో అవసరం

## నగర కమీషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు మేజర్ న్యూస్:

గుంటూరు నగరాభివృద్ధికి సీనియర్ సిటిజన్స్ సూచనలు సలహాలు ఎంతో దోహదపడతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సీనియర్ సిటిజన్స్ తో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ వివిధ రంగాలలో ఎంతో అనుభవం సాధించి ఉంటారని, అటువంటి వారి సూచనలు సలహాలు నగరాభివృద్ధికి ఎంతగానో అవసరమన్నారు. ప్రధానంగా పారిశుధ్యం, త్రాగు నీటి సరఫరా, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, పార్కులు, డివైడర్ల నిర్వహణ వంటి అంశాల పై నిర్మాణాత్మకమైన సూచనలు అందించాలని కోరారు. సీనియర్ సిటిజన్స్, జియంసి అధికారులతో ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని, గ్రూప్ లో తమ అభిప్రాయాల్ని పోస్ట్ చేయవచ్చునని తెలిపారు. కమిషనర్ గా బాధ్యతలు తీసుకున్న తగ ఐదు నెలల కాలంలో పారిశుధ్యం, రోడ్ల ఆక్రమణ, డ్రైన్లలో పూడికతీత, త్రాగు నీటి సరఫరా పై ప్రణాళికాబద్దమైన కృషి చేశామన్నారు. రాబోవు కాలంలో సీనియర్ సిటిజన్స్ సూచనల ద్వారా నగరాభివృద్ధికి, నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించుటకు కృషి చేస్తామన్నారు. అనంతరం పలువురు సీనియర్ సిటిజన్స్ మాట్లాడుతూ, తొలిసారిగా నగరాభివృద్ధి, నగరంలో చేపట్టాల్సిన అంశాల పై తమ అభిప్రాయాలు, సూచనలు




తెలిపేందుకు సమావేశం ద్వారా వేదిక కల్పించినందుకు నగర కమీషనర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నగరంలో ప్రధానంగా వార్డు అభివృద్ధి కంమిటీలను ఏర్పాటు చేయాలని, సుదీర్ఘ కాలంనుండి అసంపూర్తిగా ఉన్న నార్ల ఆడిటోరియం పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని, గోరంట్ల కొండ పై రిజర్వాయర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, త్రాగు నీటి రిజర్వాయర్ల వద్ద వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని, శంకర విలాస్ ఆర్ ఓ బి నిర్మాణ



పనులు ప్రారంభానికి ముందే రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు. అలాగే రోడ్లపై ర్యాంపులు ఆక్రమణలను లేకుండా చూడాలని, అనధికారిక ఫుడ్ స్టాల్స్ తొలగించి నగరంలో ప్రాంతాల వారీగా ఫుడ్ కోర్ట్ లు పెట్టాలని, ప్రతి వార్డులో సీనియర్ సిటిజన్స్ కు కమ్యూనిటీ హాళ్ళు నిర్మాణం, ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సి.హెచ్ శ్రీనివాసరావు, యస్.ఈ నాగమల్లేశ్వర రావు, సి.పి రాంబాబు, సి.యం.ఓ.హెచ్ డాక్టర్ అమృతం, పి.ఓ రామారావు, ఎ.డి.హెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పట్టణంలో దోమల నివారణకు ప్రతి ఒక్కరు కృషి

**తెనాలి, మేజర్ న్యూస్**

పట్టణంలో దోమల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మహా లక్ష్మీపతి రావు పేర్కొన్నారు. పట్టణంలోని 10 వ వార్డులో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వలన అనేకరకాల వ్యాధులు వస్తాయని అన్నారు. దోమల పెరుగుదాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా వుందని అన్నారు. ఇళ్లలో వుండే ఖాళీ పాత్రలు, టైర్లు, రోలు వంటి వాటిలో నీరు నిల్వఉండకుండా చూసుకోవాలని యన్నారు.పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమలను నివారించుకోవచ్చునిఅన్నారు. అందరూ దోమతెరలు వాడాలని సూచించారు. ఈ సందర్భంగా దోమల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ప్రజారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు,




ఆరోగ్యవిస్తరణ అధికారి అందె బాల చంద్రమౌళి, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎఎన్ఎం అక్కమ్మ, వాత్సల్య, శంషాద్ బేగం, ఆశా కార్యకర్తలు,సంధ్య, అలేఖ్య, ఝాన్సీ లక్ష్మి, నగరదీపిక దుర్గ, శానిటరీ సెక్రటరి లక్ష్మి, రిసోర్స్ పర్సన్ గొల్లపూడి శివజ్యోతి ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా ఉత్తమ ఏఎస్ఐగా కోటేశ్వరావు



**నకరికల్లు, మేజర్ న్యూస్**

నకరికల్లు మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరరావు కి పల్నాడు జిల్లా ఉత్తమ ఏఎస్ఐగా ప్రశంస పత్రం అందజేస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఈ సందర్భంగా ఏఎస్ఐ కోటేశ్వరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం పల్నాడు జిల్లా ఏఎస్ఐగా ప్రశంస పత్రం ఎస్పీ గారి చేతుల మీద తీసుకోవడం చాలా ఆనందంగా ఉందని ఈ యొక్క ప్రశ్నలతో పత్రం రావడానికి నా వంతుగా బాధ్యతలు ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూ విధులు నిర్వహించే క్రమంలో నన్ను సహకరించిన ప్రజలకు మా ఎస్పీ. డి.ఎస్.పి.సీఐ ఎస్ఐ సిహెచ్ సురేష్ వారందరికీ సహాయ సహకారాలు నాకు ఎప్పుడు ఉండాలని ఆయన అన్నారు

# నేడు పేటలో ఘనంగా నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు

## హాజరుకానున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట మేజర్ న్యూస్**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29 వ వర్ధంతి సందర్భంగా పేట పట్టణంలోని పలు ప్రాంతాలలో ఎన్టీఆర్ వర్ధంతిని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించనున్నారు. ముఖ్య అతిథి గా మాజీ మంత్రి, స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొనడం జరుగుతుంది.ఉదయం 9.00 గంటలకు ఎన్నార్టీ సెంటరు యందు చిలకలూరి పేట పురపా లక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వస్తున్న "స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్" కార్యక్రమాన్ని ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించను న్నారు.అనంతరం ఎన్నార్టీ సెంటరు లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించి, తదుపరి నెహ్రూనగర్, కళామందిర్ సెంటర్, గుండయ్య తోట, భావనారుషి నగర్ లో నూతన విగ్రహ ఆవిష్కరణ, సుగాలీ కాలనీ, పార్టీ కార్యాలయం, 7వ వార్డు (సంత బజారు) ప్రాంతాలలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి,అన్న దాన కార్యక్రమాలు నిర్వహించి నివాళులు



అర్పించే కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయవలసినదిగా చిలకలూరిపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షు కార్యద ర్శులు.పఠాన్ సమద్ ఖాన్, మొద్దుమాల రవిలు తెలిపారు.

# 19న ఉచిత కంటి, బ్రెయిన్ క్యాంపు

**- లలితా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. రాఘవ శర్మ**



**గుంటూరు, మేజర్ న్యూస్:.**

లలితా హాస్పిటల్, గుంటూరు వారిచే సీనియర్ న్యూరాల జిస్ట్ డాక్టర్ విజయ, సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ . నూతక్కి శ్రీనివాసరావు, సీనియర్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ విజయ బాబు ఆధ్వర్యంలో ఉచిత కంటి, బ్రెయిన్ క్యాంపును ఈ నెల 19న (ఆదివారం) పెదకూరపాడు మండలం లింగంగుంట్ల గ్రామము నందు నిర్వహిస్తున్నట్లు లలితా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ . రాఘవ శర్మ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపు నందు మెదడు, నరాల సమస్యలు – పక్షవాతం, తలనొప్పి, తూలుడు, ఫిట్స్ , వృద్ధులు, చిన్న వయస్సు లో వచ్చే నరాల సమస్యలు, స్పాండిలైటిస్, న్యూరోపతి, నడుం నొప్పి, వెన్నుముక సమస్యలు ఉన్నవారికి కంటి శుక్లం ఉన్నవారికి ఉచితముగా కంటి పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికీ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా లలితా ఆసుపత్రిలో ఉచితంగా శుక్లాల ఆపరేషన్లు చేయబడును. ఈ శిబిరంలో ఉచిత బీపీ చెకప్, బ్లడ్ షుగర్, ఈసీజీ, కంటి చెకప్, న్యూరాలజిస్ట్ కన్సల్టేషన్ చూడబడును.

# అంతర పంటలతో నిరంతరం ఆదాయం

## ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉష




**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :**


ప్రకృతి వ్యవసాయ సాగులో అంతర పంటలు పండించడం ద్వారా నిరంతరం ఆదాయం పొందవచ్చని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉష అన్నారు. పిడుగురాళ్ల మండలం గుత్తికొండ యూనిట్ గుత్తికొండ గ్రామంలో రైతులు పాపబత్తిన రాజా, ఎస్ కె ఖాజావలి ప్రకృతి వ్యవసాయ సాగులో వేసిన అంతర పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంది పంటలో అంతర పంటలుగా గోరుచిక్కుడు, బెండ, సజ్జ, అలసంద, కీరదోస, మినుము, పెసర, దోస, రక్షక పంటలుగా జొన్న వెయ్యవచ్చని తెలిపారు. దీనివల్ల కంది పంటలో ఆశించే రసం పీల్చే పురుగు, మరకాయ మచ్చల పురుగు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుందన్నారు. వివిధ రకాల పంటలు వేయడం ద్వారా అన్ని రకాల సూక్ష్మజీవులకు ఆవాసంగా మారి భూమి సారవంతం అవుతుందన్నారు. అంతర పంటల ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు అందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పిడుగురాళ్ల డివిజన్ మాస్టర్ ట్రైనర్ బాజీ బాబు, డిఎంఎం టి రవికుమార్, డిఎంఎంటి హసీనా, ఐసిఆర్ పి పురుషోత్తం, రైతులు పాల్గొనడం జరిగింది.

# ఉత్సాహంగా కొనసాగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

## ఆరవ రోజు విజయం సాధించిన నెల్లూరు, తూర్పుగోదావరి జట్లు

**మంగళగిరి, మేజర్ న్యూస్:**

మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ పోటీలు ఆరవ రోజు శుక్రవారం ఉత్సాహంగా కొనసాగాయి. నెల్లూరు – ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో నెల్లూరు జట్టు విజయం సాధించింది. తొలుత ప్రకాశం జట్టు టాస్ గెలిచి




నెల్లూరు జట్టును బ్యాటింగ్ కు ఆహ్వానించగా నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 155 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ప్రకాశం జట్టు 14.1 ఓవర్లలో 90 పరుగులు చేసి ఆల్ అవుట్ అవడంతో నెల్లూరు జట్టు 65 పరుగుల తేడాతో విజయం సాధించింది. 4 ఓవర్లలో 12 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసిన సాలుంకి అఖిల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ను కైవసం చేసుకున్నారు. చిత్తూరు – తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 9 వికెట్ల నష్టానికి గాను 138 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 19.5 ఓవర్లలో 131 పరుగులు చేసి ఆలౌటైంది. టివి సాయి శ్రావణ్ 46 బంతుల్లో 56 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను గెలుచుకున్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన ఇద్దరికీ పట్టణ తెలుగు యువత అధ్యక్షులు భోగి వినోద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కనికళ్ళ చిరంజీవి సహకారంతో ఒక్కొక్కరికీ రూ 10 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు.

# స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ లో భాగంగా విజయానికి అందరూ భాగస్వాములు కావాలి

## నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు మేజర్ న్యూస్:**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల 3వ శనివారం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే కార్యక్రమాల్లో నగరంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్గించి, సదరు కార్యక్రమాలకు



ప్రోటోకాల్ మేరకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాల నిర్వహణపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు దేశంలో అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపిని తీర్చిదిద్దడానికి 12 నెలలకు 12 థీమ్ లతో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. అందులో భాగంగా ఈ నెల 18న శనివారం న్యూ ఇయర్ – క్లీన్ స్టార్ట్ థీమ్ తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి కార్యాచరణ సిద్దం చేశామన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్



నుండి హిందూ కాలేజి సిగ్నల్ జంక్షన్ వరకు షుమారు 2 వేల మందితో స్వచ్ఛత ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ చేపడతామని, అందుకు ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం అందించాలని అదనపు కమిషనర్ కు భాధ్యతలు కేటాయించామని తెలిపారు. అదే విధంగా వార్డ్ సచివాలయాల వారీగా ర్యాలీలు, మానవహారం, ప్రతిజ్ఞలో స్థానిక ప్రజా ప్రతినిధులను, ప్రజలను భాగస్వాములను చేయాలని, నోడల్ అధికారులు పూర్తి భాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయం పరిధిలో మాస్ క్లీనింగ్, జిఎంసి స్థలాలు, డ్రైన్ల శుభ్రం, గార్బేజ్ తొలగింపు చేపట్టాలన్నారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగ అధికారులు సమన్వయంతో కార్యక్రమ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర ప్రజలు కూడా తమ ఇళ్లల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్దాలను తడిపొడిగా వేరు చేయడం, హెూం కంపోస్ట్, క్లస్టర్ కంపోస్ట్ యూనిట్స్ ఏర్పాటుకు ముందుకు రావాలని, అందుకు నగరపాలక సంస్థ నుండి తగిన తోడ్పాటుని అందిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాష, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# వైసిపి పల్నాడు జిల్లాయువజన అధ్యక్షునిగా కందుల శ్రీకాంత్

## అభినందించిన మాజీమంత్రి విడుదల రజిని

చిలకలూరిపేట మేజర్ న్యూస్

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పల్నాడు జిల్లా యువజన విభాగం నూతన అధ్యక్షుడిగా నియమితులైన కందుల శ్రీకాంత్ నుశుక్రవారం మాజీ మంత్రి విడదల రజినిని చిలకలూరిపేట పట్టణంలోని ఆమెనివాసంలో కలిశారు. ఆయనతోపాటు దాదాపు 200 మందికి పైగా పార్టీ శ్రేణులు తరలివచ్చారు. వీరిని ఉద్దేశించి విడదల రజిని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ప్రజలకు అడ్డగోలు హామీలు ఇచ్చి మాట తప్పారని దుయ్యబట్టారు.



ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా



ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలయ్యే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ విషయంలో యువజన విభాగం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పదవులు బాధ్యతను పెంచుతాయనే విషయాన్ని గుర్తుచేశారు.

నూతన అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తామని చెప్పారు. ప్రజలకు అండగా ఉంటామన్నారు. తనను నమ్మి తనకు పదవి వచ్చేలా చేసిన మాజీ మంత్రి విడదల రజినికి జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిఎంసి కమిషనర్ అవినీతి, అక్రమాలపై వివరణ ఇవ్వాలి

**కమిషనర్ పై పి ఎం కు, కేంద్ర హెూంమంత్రికి, సీఎంకు, డిప్యూటీ సీఎంకు మంత్రి నారాయణ కు ఫిర్యాదు చేస్తాం**

**విలేకరుల సమావేశంలో మేయర్ మనోహర్ నాయుడు**

**గుంటూరు ప్రతినిధి మేజర్ న్యూస్:**

గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ గా ఉన్న పోలీస్ శ్రీనివాసులు నగరపాలక సంస్థ నిధులను స్వప్రయోజనాలను వాడుకుని, కౌన్సిల్ కు తప్పుడు సమాచారం ఇస్తున్నారని, కౌన్సిల్లో ఎవరైనా అడిగినందుకు వాకౌట్ చేశారని, కమిషనర్ అక్రమాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర మంత్రి అమిత్ షా కు, కేంద్ర పర్యావరణ, విపత్తుల శాఖ మంత్రికి, అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి కి, డిప్యూటీ ముఖ్యమంత్రి కి , మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కు ఫిర్యాదు చేయనున్నట్లు నగర మేయర్ కావటి మనోహర నాయుడు తెలిపారు. గత నెలలో వాయిదా పడిన కౌన్సిల్ సమావేశమును తిరిగి ఈ నెల17 వ తేదీన (శుక్రవారం)నిర్వహించాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన లిఖితపూర్వకంగాను, మెయిల్ ద్వారా ను, వాట్సాప్ ద్వారా అను కమిషనర్ కు విన్నవించుకోవడం జరిగిందన్నారు. ఈరోజు సమావేశానికి వైసిపి కార్పొరేటర్‌లు అందరూ హాజరైనప్పటికీ కమిషనర్ సమావేశం నిర్వహించేందుకు నిరాకరించడంతోపాటు వేరే సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది అన్నారు. డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు తమ కౌన్సిల్



ఎజెండాలో పెట్టుకున్న 80 అంశాన్ని ప్రస్తావిస్తూ బుడమేరు వాగు పొంగి పొల్లిన ఘటనలో సుమారు లక్షన్నర మంది ఎఫెక్ట్ అయ్యారని, వారిని ఆదుకునేందుకు రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి దాతలు అధికారులు, ముందుకు వచ్చి వారు తోచిన మేరకు సహాయం అందించాలన్నారు.అయినప్పటికీ గుంటూరు నగరపాలక సంస్థ నుండి 9 కోట్ల 24 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లుగా అధికారులు తప్పుడు లెక్కలు చూపించారని, వాటిని ప్రశ్నించినందుకే సమావేశాన్ని బాయికాట్ చేసి కమీషనర్ అధికారులు బయటికి వెళ్లిపోయారని ఆరోపించారు. ఉన్నపలంగా 16వ తేదీన స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల షెడ్యు ప్రకటించడంలో కమిషనర్‌కు దురుద్దేశం ఉందన్నారు. తాము న్యాయస్థానాలను ఆశ్రయించబోతు న్నట్లు వెల్లడించారు. కమిషనర్ ఎన్ని అధికారాలు ఉంటాయో ఆ స్థాయిలోనే మేయర్‌కు కూడా ఉంటాయన్న సంగతిని మరో వద్దని హెచ్చరించారు. 10 లక్షల జనాభా ఉన్న గుంటూరు ప్రజలకు మేయర్గా తాను బాధ్యత వహించి నగరపాలక సంస్థలో అధికారుల అవినీతిని బయటపెట్టి మీడియా సాక్షిగా నైనా ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేస్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ వనమాబాల వజ్రబాబు, కార్పొరేటర్లు షేక్ రోషన్ అచ్చాల వెంకటరెడ్డి, వెంకట కృష్ణమాచారి ( ఆచారి), సుబ్బారెడ్డి, ధూపాటి వంశి, రాజులత, రమ్య, సాంబిరెడ్డి మరికొందరు కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.

# సీతారామయ్య సేవలు చిరస్మరణీయం



**మంగళగిరి టౌన్, మేజర్ న్యూస్:**

నగరంలోని కృష్ణ బలిజ సంఘం కమ్యూనిటీ హాల్ లో శుక్రవారం రాత్రి నియోజకవర్గ కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల మరణించిన సంఘం సీనియర్ నాయకులు కోలా సీతారామయ్య సంతాప సభ జరిగింది. సభకు సంఘం నాయకులు తుపాకుల సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వీవీ జవహర్ లాల్, రాష్ట్ర అధ్యక్షులు కోలా అశోక్ కుమార్ హాజరయ్యారు. సభలో తొలుత సీతారామయ్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు సభను ఉద్దేశించి మాట్లాడారు. సీతారామయ్య కృష్ణ బలిజల సంక్షేమం కోసం, సంఘం అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన మృతి కృష్ణ బలిజలకు తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నం నాగబాబు, నాయకులు గడ్డం నాగేశ్వరరావు, కోలా వాసుదేవ నయనార్, నాయుడు సుబ్బారావు, కోలా వీరాంజనేయులు, అజయ్ కుమార్, శ్యామ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తున్నాం

**గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న నందమూరి తారక రామారావు వర్ధంతిని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, పలు సమస్యలను అధికారులతో చరవాణిలో మాట్లాడి వెంటనే పరిష్కరించారు. అనంతరం పార్టీ నేతలతో సమావేశం నిర్వహించి శనివారం నాడు జరిగే ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించుకునేలా పార్టీ నేతలకు ఎమ్మెల్యే దిశానిర్ధేశం చేశారు. పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలన్న సంకల్పంతో పార్టీ పెట్టిన ఎన్టీఆర్ స్ఫూర్తితో నియోజకవర్గములో అనేక చోట్ల అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలతో పాటు నగరంపాలెంలోని రిజిస్టర్ ఆఫీస్ వద్ద, నల్లచెరువు 3 బొమ్మల సెంటర్, కొరిటెపాడు మెయిన్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణలు జరగబోతున్నాయని, ఈ కార్యక్రమాలను పార్టీ నేతలు పెద్దఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



# 19న ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం

**కిమ్స్ శిఖర హాస్పిటల్ ఆధ్వర్యంలో గురజాలలో నిర్వహణ - డాక్టర్ చిట్టెం లక్ష్మణ్**

**గుంటూరు మేజర్ న్యూస్:**

గురజాలలో జన్మించిన వ్యక్తి తన ప్రాంత ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ తనకి వీలైనంత సాయం చేస్తూ, వైద్య సేవలు అందిస్తూ గుంటూరు పట్టణం నందు మెదడు, వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులుగా పేరుగాంచిన డాక్టర్ చిట్టెం లక్ష్మణ్ తన సొంత ప్రాంత ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం మన గురజాల పట్టణము, పరిసర ప్రాంత ప్రజలకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. భారతదేశవ్యాప్తంగా వైద్య రంగంలో ఎంతో ప్రసిద్ధి చెందిన మన కిమ్స్ హాస్పిటల్స్ ఇప్పుడు మన గుంటూరు లో కిమ్స్ శిఖర పేరుతో మంగళగిరి రోడ్డు నందు ఏర్పాటు చేయడం జరిగింది, ఈ హాస్పిటల్ నందు నిష్ణాతులైన వైద్య బృందం, అత్యాధునిక వైద్య పరికరాలు, ఎటువంటి ఆరోగ్య సమస్యలకైనా కిమ్స్ శిఖర హాస్పిటల్స్ మీకు అందుబాటులో ఉంటుంది. ఈ క్రమంలో కిమ్స్ శిఖర హాస్పిటల్స్ గుంటూరు మన గురజాల పట్నమునందుగల ప్రభుత్వ హైస్కూల్ నందు 19 వ తేదీ జనవరి అనగా ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తారు.ఈ మెగా వైద్య శిబిరం నందు గుండె,మెదడు,నరములు, పక్షవాతం,జీర్ణకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఎముకులు, కీళ్ల వ్యాధులు,జ్వరాలు, చిన్న పిల్లల వ్యాధులు, స్త్రీ, ప్రసూతి వ్యాధులు,షుగర్, థైరాయిడ్, రక్తపోటు వంటి సమస్యలపై నిష్ణాతులైన సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు సేవలు అందించెదరు.డాక్టర్ చిట్టెం లక్ష్మణ్ ఆధ్వర్యంలో అగ్రశ్రేణి వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొంటారు.ఈ మెగా వైద్య శిబిరం నందు ఉచితంగా చేయు వైద్య పరీక్షలు బీపీ, షుగర్,ఈసీజీ ఎకో (గుండె స్కానింగ్) బీఎండీ (ఎముకల సాంద్రత పరీక్ష),బిఎంఐ పిఎఫ్ట్ (ఊపిరితిత్తుల సామర్థ్య) పరీక్షలు నిర్వహిస్తారని , అలాగే అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని కిమ్స్ శిఖర హాస్పిటల్స్ మేనేజ్మెంట్ తెలియజేసింది.ఈ వైద్య శిబిరంలో పాల్గొనదరిచినవారు వారి పాత వైద్య పరీక్షల రిపోర్టులు వెంట తీసుకురావాలని సూచించారు.ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోనీ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించినవివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్ 83097 13983 కు సంప్రదించాలని సూచించారు.

# శాశ్వత సభ్యత్వం తీసుకున్న సుఖవాసి శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి సుఖవాసి శ్రీనివాసరావు శుక్రవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా 1 లక్ష రూపాయలతో శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి సుఖవాసి శ్రీనివాస్ రావును అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో సరికొత్త రికార్డు సృష్టిస్తున్నదని నేటితో 1కోటి సభ్యత్వాల మార్క్ దాటిందని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు వేగంగా జరుగుతున్నదని, ఇదే స్ఫూర్తితో నాయకులు శాశ్వత సభ్యత్వం తీసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

# వికలాంగుల పెన్షన్లు వెరిఫికేషన్ చేసిన వైద్యులు

**మాచవరం, మేజర్ న్యూస్**

మాచవరం మండలంలో 15వేల రూపాయల వికలాంగుల పెన్షన్ను పరిశీలించిన డాక్టర్ వి సత్యనారాయణ, డాక్టర్ రాజశేఖర్, స్థానిక పిహెచ్సి వైద్యులు డాక్టర్ ప్రసాదరావు డాక్టర్ అన్వేష్ల వైద్యాధి కారులు రెండు టీములుగా ఏర్పడి 15000 పెన్షన్ తీసుకుంటున్న వికలాంగులను వెరిఫికేషన్ శుక్రవారం చేశారు. మాచవరం మండలంలో మొత్తం 16 మంది లబ్ధిదారులు ఉండగా వారిలో ఒక వ్యక్తి మరణించాడని 15 మంది అంగవైకల్యం గురించి వారి ధ్రువీకరణ పత్రాలు, ఫిజికల్ వెరిఫికేషన్ చేశారు. వారిని వైద్య బృందం ధ్రువీకరించారు సేకరించిన సమాచారాన్ని జిల్లా డిఎం అండ్ హెచ్ ఓ కి అందజేస్తామని వైద్య బృందం తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఇన్చార్జి ఎంపీడీవో వెంగళరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ పాటించాలి

## గుంటూరు జిల్లా కలెక్టర్ పిలుపు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



జిల్లాలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రవేటు సంస్థలలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహణపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయితీ సెక్రటరీలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రతి నెల ఒక థీమ్ తో 12 నెలలు స్వచ్ఛత కార్యక్రమాలను కాంపెయిన్ మోడ్ లో నిర్వహించేలా మార్గదర్శకాలను జారీ చేశారన్నారు. మొదటి నెల జనవరి 18వ తేది శనివారం న్యూ ఇయర్ - క్లీన్ స్టార్ దీమ్‌తో స్వచ్ఛత కార్యక్రమాలు జిల్లాలోని ప్రతి మున్సిపాల్టీలో, గ్రామ స్థాయిలోను నిర్వహించాలన్నారు. పురపాలక, పంచాయితీ శాఖలతో పబ్లిక్, ప్రైవేటు సంస్థలలోను స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహణకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన వ్యర్థాల శుభ్రం చేయటం, కాల్వలు పూడికతీయుట, త్రాగునీరు ట్యాంకులు క్లీనింగ్, క్లోరినేషన్, వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సౌకర్యాలు పనులు కల్పన తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తూ స్వచ్ఛత కార్యక్రమాలను వ్యక్తిగతంగా నిరంతరం నిర్వహించేలా వినుత్నమైన విధానాలతో కార్యక్రమాలను రూపొందించాలన్నారు. కార్యక్రమ నిర్వహణ పర్యవేక్షణకు శాఖల వారీగా నోడల్ అధికారులు నియమించాలన్నారు. శనివారం జిల్లాలోని అన్ని గ్రామాల్లో, మున్సిపాల్టీలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజలతో స్వచ్ఛత ఆంధ్రా - స్వచ్ఛత దివాస్ కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించాలన్నారు.

# నెహ్రూనగర్‌లోని గోదాదేవి సహిత శ్రీ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు



**గుంటూరు మేజర్ న్యూస్** : ఆయిశెట్టి సీతారామయ్య చారి టబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెహ్రూ నగర్‌లో నిర్వహించిన శ్రీ రంగనాయకి శ్రీ గోదాదేవి సాహిత శ్రీ రంగనాథ స్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ పాల్గొన్నారు. శుక్రవారం నెహ్రూనగర్ లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభాకర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు చైర్మన్ డేగల ప్రభాకర్ కు ఘనస్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని డేగల ప్రభాకర్ ప్రారంభించడం జరిగింది. ఆ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో యర్రగోపు నాగేశ్వర రావు, ఆయిశెట్టి శ్రీను,, బొక్కిసం శివరామ్, రాగం సదా శివరావు, మేకల బాబురావు, వినోద్, యర్రగోపు వాసు, కుమార్, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.


18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో 'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది, అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో "నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులకు నియమించుకోవదలిచాము. కావలెను. ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్ళూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం, 5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను, 8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్, 11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి, 13. బొల్లాపలి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు : జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466
ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.

నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

సూర్య www.suryaa.com

సంక్రాంతి శుభాకాంక్షలు..

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

పి. బాలు (చిన కొండయ్య) - బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777
జి.శ్రీనివాసరావు - గుంటూరు జిల్లా ఇన్‌చార్జి - సెల్ : 9959426987
ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) - స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466
జి.హిరన్మాయి(కన్నల్) - నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి, జిల్లా క్రైమ్ రిపోర్టర్
శేషగిరి రాజు - మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి - సెల్ : 8341408201
వై.ఏసుబాబు - గురజాల ఆర్సీ ఇన్‌చార్జి - సెల్ : 9701250872
బి.పూర్ణచంద్రరావు - సత్తెనపల్లి ఆర్‌సి ఇన్‌చార్జి - సెల్ : 9866246951
చెవుల రంగారావు - మెడికల్ రిపోర్టర్, గుంటూరు - సెల్ : 9490544635
యం.కృష్ణ - మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి - సెల్ : 9393309149
వి.రవికుమార్ - తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి - సెల్ : 99083 38200
డి. చైతన్య - వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి - సెల్ : 9381968453
వి.లూథర్ - నరసరావుపేట రిపోర్టర్ - సెల్ : 7799382078
జి.ఏలియా - ముప్పాళ్ళ రిపోర్టర్ - సెల్ : 9392231959
బి.సాంబశివరావు - రాజుపాలెం రిపోర్టర్ - సెల్ : 9949382676
రమేష్ - దుగ్గిరాల రిపోర్టర్ - సెల్ : 9866782780
ఎస్.వెంకటేశ్వర్లు - పెదకాకాని రిపోర్టర్ - సెల్ : 9948175840
కె.నాగరాజు - రిపోర్టర్, గుంటూరు - సెల్ : 7799881000
డి.రమేష్ - ఈపూరు రిపోర్టర్ - సెల్ : 9110734898
పి.లక్ష్మీనారాయణ - నూజెండ్ల రిపోర్టర్ - సెల్ : 9666474953
ఎస్.కె. రవూఫ్ - శావల్యాపురం రిపోర్టర్ - సెల్ : 7989434737
అక్కిరెడ్డి - నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ - సెల్ : 9849134987
బి.గురవయ్య - వినుకొండ క్రైం రిపోర్టర్ - సెల్ : 9908340426
వి.లక్ష్మీనారాయణ - రెంటచింతల రిపోర్టర్ - సెల్ : 8500079075
పి.వెంకటేశ్వర్లు - దుర్గి రిపోర్టర్ - సెల్ : 8185815858
టి.శ్రీకాంత్ - వెల్దుర్తి రిపోర్టర్ - సెల్ : 9912818723
పి.మణికంఠ - మాచర్లటౌన్ రిపోర్టర్ - సెల్ : 7013169885
ఎస్.డి.మహబూబ్ - మాచర్ల క్రైం రిపోర్టర్ - సెల్ : 9989124898
ఎం.కోటేశ్వరరావు - మాచవరం రిపోర్టర్ - సెల్ : 6303775169
డి.మల్లికార్జునరావు - యడ్లపాడు రిపోర్టర్ - సెల్ : 8309237441
రమేష్ - క్రోసూరు రిపోర్టర్ - సెల్ : 9493148828
రాజ్‌కుమార్ - పిడుగురాళ్ళటౌన్ రిపోర్టర్ - సెల్ : 9160218268
షేక్ నాగూర్ - నకరికల్లు రిపోర్టర్ - సెల్ : 98489 26300
పి.ఆనంద్ - వినుకొండ రూరల్ రిపోర్టర్ - సెల్ : 8125125239
నాగరాజు - మంగళగిరి టౌన్ రిపోర్టర్ - సెల్ : 9032258913
రమేష్ - నరసరావుపేట రూరల్ రిపోర్టర్ - సెల్ : 7075942600
"నేటి దినపత్రిక సూర్య" ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు.